క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల తనిఖీ



సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు న్యూసిటీ: నగరంలో పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు హెచ్చరించారు. ఆయన శుక్రవారం నగరంలోని వెంకటరమణ కాలనీ, అశోక్ నగర్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ఆకస్మిక తనిఖీలు చేశారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల విషయంలో ఫిర్యాదులు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని హెచ్చరించారు.

పార్టీ ఆస్తులను కాజేస్తే ఊరుకోం



జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కళా వెంకట్రావు భవనం సొసైటీ పేరిట చేసిన రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేయాలని ఆ పార్టీ నాయకులు జిల్లా రిజిస్ట్రార్ ఎం.చెన్నకేశవ రెడ్డిని కోరారు. శుక్రవారం నంద్యాల జిల్లా అధ్యక్షుడు జే.లక్ష్మీనరసింహ, కర్నూలు సిటీ కాంగ్రెస్‌అధ్యక్షుడు జిలానీ బాషా ఆధ్వర్యంలోని బృందం జిల్లా రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. కొందరు పార్టీ ఆస్తులను కాజేసేందుకు కళా వెంకట్రావు భవన్ పేరిట కాంగ్రెస్ కార్యాలయాన్ని సొసైటీగా మార్చారని, దీన్ని సహించబోమన్నారు. పార్టీ ఆస్తి ఎవరి సొంతం కాకుండా ఉండేందుకే సొసైటీని రద్దు చేయాలని కోరుతున్నట్లు వారు చెప్పారు.

మాజీ సైనికుడి మృతి



శివరాంరెడ్డి

కర్నూలు(అర్బన్): నగరంలోని బుధవారపేటలో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు (హవల్దార్) శివరాంరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య తెలిపారు. 24 సంవత్సరాలు సైన్యంలో విధులు నిర్వహించిన ఆయన పదవీ విరమణ పొందిన అనంతరం స్థానిక రేడియో స్టేషన్‌లో పని చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నామని, ఆయన కుటుంబ సభ్యులకు సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు.

పిన్నీసును మింగిన మూడేళ్ల చిన్నారి



చిన్నారి కడుపులో కనిపిస్తున్న పిన్నీసు (ఎక్స్‌రే చిత్రం)

కర్నూలు (హాస్పిటల్): మూడేళ్ల చిన్నారి తెలియక పిన్నీసు మింగడంతో వైద్యులు చాకచక్యంగా తొలగించి పునర్జన్మ ప్రసాదించారు. శుక్రవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ పి.అబ్దుల్ సమద్ వివరాలు వెల్లడించారు. నగరంలోని మూడేళ్ల చిన్నారి వారం రోజుల క్రితం ఇంట్లో పొరపాటున పిన్నీసును మింగడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆ పాపకు ఎక్స్‌రే తీయగా కడుపులోని చిన్నపేగులో పిన్నీసు ఇరుక్కుపోయినట్లు గుర్తించారు. అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ బాల ప్రవీణ్‌కుమార్ సహకారంతో డాక్టర్ అబ్దుల్ సమద్ ఎండోస్కోపీ ద్వారా పిన్నీసును విజయవంతంగా బయటకు తీశారు. కొంత సేపటి తర్వాత పాప కోలుకోవడంతో అదే రోజు డిశ్చార్జ్ చేసినట్లు డాక్టర్ అబ్దుల్ సమద్ తెలిపారు.

అవయవ దానానికి ముందుకు రావాలి

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ అవయవ దానానికి ముందుకు రావాలని రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బర్మా సురేష్‌కుమార్, శుక్రవారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. గత సంవత్సరం ఇదే రోజు అవయవదాత పావనీలత మరణించి ఆరుగురికి జీవితానిచ్చి స్ఫూర్తిగా నిలిచారన్నారు. బ్రెయిన్‌డెడ్‌తో అనేక మంది మరణిస్తుంటారని, కుటుంబసభ్యులు పెద్దమనసుతో ఆలోచించి అవయవ దానానికి ముందుకు రావాలన్నారు. బ్రెయిన్‌డెడ్ అయిన కుటుంబాలకు ప్రభుత్వాలు ముందుకొచ్చి రూ.10 లక్షలు ఆర్థిక సహాయం ప్రకటిస్తే వారి పిల్లలను ఆదుకున్న వారవుతారన్నారు. దీని వల్ల మరికొందరు అవయవ దానానికి ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు.

● ఈ చిత్రంలో కనిస్తునది దిన్నె దేవరపాడు రోడ్డులో ఉన్న పార్కు. ఈ పార్కులో ముళ్ల పొదలు పెరగడంతో వృథాగా మారింది. ఈ పార్కును వినియోగంలోకి తెస్తే మహాలక్ష్మినగర్, మిలటరీ క్యాంటిన్ పరిసర ప్రాంతాల్లో కాలనీల ప్రజలకు ఎంతో ఉపయోగం ఉంటుంది.



దిన్నెదేవరపాడు రోడ్డులోని పార్కులో పెరిగిన పిచ్చి మొక్కలు

● ఈ చిత్రంలో కనిపిస్తున్న పార్కు సంక్షేమ భవన్ వెనక ఉన్నది. కొన్ని నెలల కిందట ఈ పార్కు గేటు విరిగి కింద పడింది. దీంతో పార్కు లోపల చెట్లు కింద పడి ఎండిపోయాయి. పార్కు లోపల మద్యం సీసాలు కనిపిస్తున్నాయి. పార్కు వినియోగంలో లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



సంక్షేమ భవన్ వెనుక ఉన్న పార్కులో విరిగిన గేటు

ఆహ్లాదం.. అందనంత దూరం

- పార్కులు ఉన్నా వసతులు శూన్యం
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్న దృశ్యం
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- పార్కులను అభివృద్ధి చేయాలని కోరుతున్న ప్రజలు

కల్లూరు: కర్నూలు నగరంలో మొత్తం 52 వార్డులు ఉండగా అందుల్లో 16 వార్డులో పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్‌లో ఉన్నాయి. అర్బన్ వార్డుల్లో సుమారుగా 2.5 లక్షల మంది జనాభా ఉన్నారు. కల్లూరు అర్బన్ ప్రాంతం రోజు రోజుకు విస్తరిస్తోంది. అయితే అందుకు తగ్గట్టుగా మున్సిపల్ అధికారులు వసతులు కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

మారిన జీవనశైలిలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ కనపరుస్తున్నారు. కాలుష్యం లేని స్వచ్ఛమైన గాలి తీసుకోవాలని, కాసేపు ఆహ్లాదంగా గడపాలని భావిస్తున్నారు. ఇందుకు పార్కులను ఆశ్రయిస్తున్నారు. అర్బన్ పరిధిలోని ఆయా కాలనీలలో మున్సిపల్ పార్కులు ఏర్పాటు చేశారు గానీ ఎలాంటి వసతులు కల్పించడం లేకపోవడంతో వృథాగా ఉన్నాయి. కొన్ని పార్కుల్లో ముళ్ల పొదలు, చెట్లు పెరిగాయి. మరికొన్ని పార్కుల్లో మద్యం సీసాలు, చెత్త చెదారంతో నిండి ఉన్నాయి. పార్కులు వినియోగంలో లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పార్కులో పిచ్చి మొక్కలను తొలగించి పచ్చదనంతో నింపాలి. చిన్న పిల్లలకు ఆడుకునే పరికరాలు, యువకులు, పెద్దలు వ్యాయామం చేయడానికి పరికరాలు ఏర్పాటు చేయాలి. అదే విధంగా ఆయా కాలనీలో ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకునే విధంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



పార్కులో మందుబాబులు తాగి పడేసిన మద్యం సీసాలు

పార్కును వినియోగంలోకి తేవాలి



కల్లూరు అర్బన్ పార్థసారథి నగర్‌లో ఉన్న పార్కును వినియోగంలోకి తేవాలి. పార్కు మొత్తం చెత్త చెదారం, ఇటుకలతో నిండి ఉంది. కాలనీలో పార్కు ఉన్న వినియోగంలో లేకపోవడంతో ఆహ్లాదం కోసం ఇతర పార్కులకు వెళ్లాల్సి వస్తోంది. పార్కులో పిల్లలు ఆటలాడుకునే పరికరాలతో పాటు వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి.
– ప్రవీణ్‌కుమార్, పార్థసారథి నగర్

వసతులు కల్పించాలి



కల్లూరు అర్బన్ పరిధిలోని 21వ వార్డులో ఉన్న పార్కులలో వసతులు కల్పించాలి. వార్డులోని కొన్ని పార్కుల్లో ముళ్ల పొదలు పెరిగాయి. పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు, వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేస్తే స్థానికులు ఉదయం, సాయంత్రం వాకింగ్, వ్యాయామం చేసుకుంటారు. సంబంధిత అధికారులు పార్కుల్లో వసతులు కల్పించి వినియోగంలోకి తేవాలి. – జె.శ్యామ్, 21వ వార్డు

కార్యకర్తలకు అండగా ఉంటాం

కర్నూలు న్యూసిటీ: అట్టడుగు వర్గాల వారికి రాజకీయ అవకాశాలు కల్పించిన ఏకై క నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు నగర ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన పరశురాం దళిత నాయకులతో కలిసి శుక్రవారం ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ అధ్యక్షురాలు విజయమనోహరి దంపతులను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని భరోసా ఇచ్చారు. నాయకులు కాశపోగు ఏసు, నాగపురి వనష్, చోటు, యోగి, చిన్న, అంజి తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న కార్యకర్తలు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కర్నూలు (అర్బన్): జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ వింగ్ అధ్యక్షుడిగా ఎన్నికైన 1వ వార్డు కార్పొరేటర్ సి.షేక్షావలి శుక్రవారం రాత్రి జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డిని కలిసి శాలువా కప్పి పూలబొకేతో కృతజ్ఞతలు తెలిపారు. పలువురు పార్టీ నేతలు ఉన్నారు.

విజయం కోసం పోరాడాలి

కర్నూలు న్యూసిటీ: క్రీడ ఏదైనా విజయమే లక్ష్యంగా పోరాడాలని రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా సూచించారు. ఉమ్మడి జిల్లాలోని అండర్–18 నెట్ బాల్ క్రీడాకారులకు సెలక్షన్స్ శుక్రవారం స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మహబూబ్ బాషా మాట్లాడుతూ.. శారీరక, మానసిక దృఢత్వానికి నెట్ బాల్ ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. సెలక్షన్లలో ప్రథమ, ద్వితీ య, తృతీయ స్థానాలు సాధించిన విజేత జట్లకు కప్‌లు అందజేశారు. నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపకులు నాగరత్నమయ్య, అధ్యక్షుడు నాగేశ్వరబాబు, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన కర్నూలు జిల్లా జట్టు

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

కర్నూలు(రూరల్): నులి పురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యవంతులువుతారని నోడల్ ఆఫీసర్ రఘు తెలిపారు. శుక్రవారం గొందిపర్ల గ్రామంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగులు శరీరంలో ఉంటే ఆకలి మందగిస్తుందన్నారు. కడుపు నొప్పి, రక్త హీనత, విరేచనాలు, వాంతులు, వికారం తదితర అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. నులిపురుగులు ఉన్న చిన్నారుల్లో ఎదుగుదల లోపం తలెత్తుందని, మలంలో రక్తం లక్షణలు కనిపిస్తాయన్నారు. వీటి నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను ఏడాదికి 2 సార్లు పిల్లలతో మింగించాలన్నారు. పిల్లలు గడ్డిలో, బురదలో చెప్పులు లేకుండా నడవరాదన్నారు. కూరగాయలు, పండ్లు శుభ్రంగా కడుక్కొని తినాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు రేష్మ, నిరంజన్, సామాజిక ఆరోగ్య అధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

అల్లూరిని స్మరించుకుందాం

కర్నూలు(సెంట్రల్): అల్లూరి సీతారామరాజు 100వ వర్ధంతి పురస్కరించుకొని ఫిబ్రవరి 22, 23 తేదీల్లో నిర్వహించే విద్యార్థుల జాతాను జయప్రదం చేయాలని ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.శివప్రసాదు, సురేష్ కోరారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థుల జాతాకు సంబంధించిన పోస్టర్లను ఏఐడీఎస్‌ఓ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విశాఖపట్నం నుంచి అల్లూరి సీతారామరాజును బ్రిటీషు సామ్రాజ్యవాదులు కాల్చి చంపిన కృష్ణదేవి పేటలోని ఆయన సమాధి వరకు ర్యాలీ ఉంటుందని, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొనాలని కోరారు. నాయకులు చరణ్‌రాజ్, చరణ్ తేజ్, మల్లేష్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐడీఎస్‌ఓ నాయకులు

యార్డులో మిర్చి వ్యాపారులకు షాపులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మిర్చి వ్యాపారులు షాపులు నెలకొల్పేందుకు మార్కెట్ కమిటీ స్థలాన్ని కేటాయించింది. కూరగాయల మార్కెట్‌లో రిటైల్ షాపుల పక్కన ఉన్న ఖాళీ స్థలాన్ని మిర్చి వ్యాపారులకు కేటాయిస్తూ మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జ్, మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు ఉత్తర్వులు జారీ చేశారు. కేటాయించిన స్థలంలో వ్యాపారులే సొంత ఖర్చుతో షాపులు నిర్మించుకోవాలి. అద్దె ప్రాతిపదికన షాపులు కేటాయించేందుకు శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంపాట ద్వారా 13 మందికి అద్దె ప్రాతిపదికన స్థలాలకు వేలం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి, మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి పాల్గొన్నారు.

హమాలీలకు యూనిఫాం పంపిణీ

మార్కెట్ యార్డులోని లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీలకు యూనిఫాం పంపిణీ చేశారు. మార్కెట్ యార్డులో జరిగిన కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ జేడీ మాట్లాడుతూ... మార్కెట్‌లో హమాలీల సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 184 మందికి యూనిఫాం పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి, ఏడీఎం నారాయణమూర్తి, అసిస్టెంటు సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న తదితరులు పాల్గొన్నారు.



హమాలీలకు యూనిఫాం పంపిణీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు

హమాలీలకు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలి

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేసే హమాలీలకు పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలని సీఐటీయూ నాయకులు కోరారు. నగర కార్యదర్శి సాయిబాబా మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో లైసెన్స్ పొందిన హమాలీలందరికీ ఈ సదుపాయం కల్పించాలని, రెండు జతల యూనిఫాం పంపిణీ చేయాలని కోరారు.ఈ మేరకు జేడీ రామాంజనేయులుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీసన్న, రామకృష్ణ, కోదండరాముడు, మధు, నాగరాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా చూడాలి

కర్నూలు(అర్బన్): దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా రాకపోకలు సాగించేందుకు ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లో ర్యాంప్‌లు, బ్రెయిలీ సిగ్నల్స్, సైన్ బోర్డులు ఉండాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రయిస్ ఫాతిమా కోరారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వ సాంఘిక, సామాజిక న్యాయ శాఖ న్యూఢిల్లీ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో 'సుగమ్యా యాత్ర' కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ర్యాంప్‌లు, బ్రెయిలీ సిగ్నల్స్, సైన్ బోర్డుల గురించి అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించి 'ఎస్ టు యాక్సెస్' ను కేంద్ర ప్రభుత్వం ప్రాంభించిందన్నారు.

మాజీ సైనికులకే సెక్యూరిటీ ఏజెన్సీలు ఇవ్వాలి

కర్నూలు(అర్బన్): మాజీ సైనికులకు సెక్యూరిటీ ఏజెన్సీలు నిర్వహించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, రాయలసీమ కో–ఆర్డినేటర్ నర్రా పేరయ్య కోరారు. మాజీ సైనికులు కాని వారు సెక్యూరిటీ గురించి తెలియని వారు ఏజెన్సీలు నిర్వహిస్తూ మాజీ సైనికులకు అన్యాయం చేస్తున్నారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. మాజీ సైనికులకు తప్ప ఇతరులకు ఏజెన్సీలు ఇవ్వకుండా ప్రభుత్వం చట్టం తీసుకురావాలని, అందుకు అనుగుణంగా జీఓ జారీ చేయాల్సి ఉందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర నేతల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు.

రగ్బీ క్రీడాకారులకు శిక్షణ

కర్నూలు న్యూసిటీ: ఏపీ సబ్ జూనియర్ బాలికల అండర్ – 15 జట్టుకు శిక్షణ కొనసాగుతోంది. శుక్రవారం దిన్నెదేవరపాడులోని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ క్రీడా మైదానంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను జరుగుతున్న శిక్షణను ఒలింపిక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు పరిశీలించారు. క్రీడాకారులు ఈ నెల 11, 12 తేదీల్లో మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జరిగే పదవ జాతీయ స్థాయి సబ్ జూనియర్ అండర్–15 రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. కోచ్ శ్రీకాంత్, నరసింహ క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

ఆసుపత్రి పేయింగ్ బ్లాక్‌లో డీలక్స్ రూమ్‌లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పేయింగ్ బ్లాక్‌లో త్వరలో డీలక్స్ రూమ్‌లు ప్రారంభిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు చెప్పారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలో గ్రాండ్ రౌండ్స్‌లో భాగంగా పలు ఓపీ విభాగాలైన మెడికల్, ఆర్థోపెడిక్, చిన్నపిల్లల, గైనిక్, సూపర్ స్పెషాలిటీ ఓపీలతో పాటు ఎంసీహెచ్, గైనిక్, డైట్ విభాగాలను తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో వాటర్ లీకేజ్ మరమ్మతులను త్వరగా పూర్తి చేయాలని హెల్త్ ఇన్స్‌పెక్టర్లను ఆదేశించారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయకుండా చూసుకోవాలని సెక్యూరిటీ సిబ్బందిని ఆదేశించారు. చెప్పారు. ఫార్మసి డిపార్ట్‌మెంట్‌ను పరిశీలించి ఫార్మసి మాడ్యూల్స్‌లోని ఈ–హాస్పిటల్ అప్‌లోడింగ్ ప్రాసెస్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఫార్మసి సిబ్బందికి తెలిపారు. ఆయన వెంట సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, న్యూ డయాగ్నోస్టిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఆసుపత్రి ఏడీ మల్లేశ్వరమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రి బాయి తదితరులు ఉన్నారు.



ఆసుపత్రిని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, అధికారులు

9 నుంచి ఘంటసాల ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: ఘంటసాల గాన కళా సమితి, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు ఘంటసాల ఆరాధనోత్సవాలను నిర్వహించనున్నట్లు కళాక్షేత్రం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ్యా తెలిపారు. సీక్యాంప్ కళాక్షేత్రంలో ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి 9 గంటల వరకు ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. గాయకులు సుధారాణి, హబీబ్, శ్రీనివాసులు, హైదరాబాద్‌కు చెందిన అఖిల, కాకినాడకు చెందిన పీవీ రమణ పాల్గొని సంగీత కచేరీలు నిర్వహిస్తారని వెల్లడించారు. చంద్రకంటి మద్దయ్య, బీఎస్ రావు, కేవీ రావు, బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డిలు కార్యక్రమ నిర్వాహకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. సంగీత ప్రియులు, ఘంటసాల అభిమానులు అందరూ పాల్గొనాలని కోరారు.

కేవీఆర్‌లో ఉచిత వైద్య శిబిరం

కర్నూలు (సిటీ): ఓమ్నీ హాస్పిటల్, ఓక్ డెంటల్ హాస్పిటల్ సంయుక్తంగా కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపునకు ఎండీ డాక్టర్ శిశిర, గైనకాలజిస్ట్ డాక్టర్ సుధారమణి, డెంటిస్ట్ డాక్టర్ స్రవంతి విచ్చేసి విద్యార్థినులకు, కళాశాల ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. బయోకెమిస్ట్రీ విద్యార్థినులు రక్త గ్రూపు పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. ఆ కాలేజీ ఇన్‌చార్జ్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీఎస్‌వీ ప్రసాద్ గుప్తా, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీవారి కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్: సంకల్ బాగ్ హరిహర క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీదేవి భూదేవి సహిత శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ 19వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృత అభిషేకం, విశేష అర్చనలు, హోమాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణం కనులపండువగా జరిగింది. వేద పండితులు శాస్త్రోక్తంగా వేద మంత్రాలతో కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారి రథోత్సవం జరిగింది. కర్నూలు బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్, గౌరవాధ్యక్షులు దుర్గా ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజు శర్మ, తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస కల్యాణం జరిపిస్తున్న పండితులు

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని బి.క్యాంపులో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గీతాంజలి నర్సింగ్ కళాశాల ఆధ్వర్యంలో స్కూల్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహించారు. మూడవ సంవత్సరం విద్యార్థులు వారి పాఠ్యాంశంలో భాగంగా పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆరో గ్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయు డు గోవిందు ముఖ్యఅతిథిగా హాజరై నర్సింగ్ విద్యార్థులతో వైద్యపరీక్షలు చేయించుకుని అభినందించా రు. కళాశాల ప్రిన్సిపల్ వసంతకుమారి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సురేఖ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

రమాబాయి త్యాగాలు చిరస్మరణీయం

కర్నూలు(అర్బన్): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి త్యాగాలు చిరస్మరణీయమని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక వేదిక కార్యాలయంలో రమాబాయి 127వ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నంది విజయలక్ష్మి, రాయలసీమ అధ్యక్షురాలు భారతమ్మ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. నంది విజయలక్ష్మి మాట్లాడుతూ.. రమాబాయికి తొమ్మిదేళ్ల వయస్సులోనే అంబేడ్కతో వివాహం జరిగిందన్నారు. అప్ప టి నుంచే ఆమె అంబేడ్కర్‌కు అన్ని విషయాల్లో తోడుగా ఉంటూ ఆయన విజయాలకు కారణమయ్యారన్నారు. మహిళా నేతలు ఈరమ్మ, ఎలీశమ్మ, కటికె భాను, పద్మావతి, హసీన్‌బీ తదితరులు పాల్గొన్నారు.



రమాబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

హొళగుందలో సినిమా చిత్రీకరణ



సిద్దేశ్వరస్వామి ఆలయ ఆవరణలో చిత్ర బృందం

హొళగుంద: స్థానిక సిద్దేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం సినిమా సందడి నెలకొంది. సినీ నిర్మాతగా మారిన గ్రామానికి చెందిన తోక వెంకటేష్.. డైరెక్టర్ అజయ్ సూర్యతో కలిపి తీయబోయే సినిమా కార్యక్రమాలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నటీ నటులు ఐశ్వర్య, తిరుతో పాటు మేనేజర్ ఖాదర్ బాషా, హసన్, చిత్ర యూనిట్ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమానికి ఎస్‌ఐ బాల నరసింహులు, ఆలయ ధర్మకర్త రాజ పంపన్నగౌడ్, గ్రామపెద్దలు డాక్టర్ తిప్పయ్య, చిన్నహ్యాట శేషగిరి, సిద్ధార్థగౌడ్, గోపాల్‌రెడ్డి, బాగోడి రాముడు, దుర్గప్ప, అశోక్ పాల్గొన్నారు. డైరెక్టర్ తోక వెంకటేష్ మాట్లాడుతూ 1995లో జరిగిన వాస్తవ ఘటనను దృష్టిలో ఉంచుకుని చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు.